క్లుప్తంగా

దీపావళి వేడుకలకు దూరం

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి



అనపర్తి: మండపేట నియోజకవర్గం రాయవరంలో శ్రీగణపతి గ్రాండ్ ఫైర్ వర్క్స్‌లో జరిగిన ఘోర దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ఆదివారం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఘటన కారణంగా ఈ ప్రాంతమంతా దుఃఖంలో మునిగిపోయిందని, ఇటువంటి సమయంలో బాణసంచా కాలుస్తూ ఆనందోత్సవాలు జరుపుకోవడం సరికాదని అభిప్రాయపడ్డారు. ఈ ఏడాది తాను దీపావళి వేడుకలకు దూరంగా ఉన్నట్టు ప్రకటించారు.

సూర్యదేవుడికి ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో సూర్యదేవుడు, దేవేరులు

పెదపూడి: జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన ఉషా, ఛాయ, పద్మిని, సొంజ్ఞ సమేత సూర్యదేవుడి సన్నిధిలో ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యులు ఆధ్వర్యంలో రుత్వికులు ఆలయంలో స్వామివారికి ప్రత్యేక, వ్రత పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, ఉచిత అన్న ప్రసాదం అందజేశారు.

చంద్రశేఖర స్వామికి అభిషేకాలు



చంద్రేడులో చంద్రశేఖరస్వామి

రంగంపేట: మాస శివరాత్రి సందర్భంగా చంద్రేడు గ్రామంలో కొలువైన కాత్యాయనీ సమేత చంద్రశేఖర స్వామికి ఆదివారం అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఆరు గంటల నుంచి అభిషేకాలు ప్రారంభించారు. స్వామివారిని విశేషాలంకరణలు చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించినట్టు ఆలయ అర్చకుడు మైలవరపు కృష్ణశర్మ తెలిపారు. భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

లయన్స్ క్లబ్ ఆర్థిక సాయం



అనంత్‌కుమార్‌కు ఆర్థిక సాయం అందజేస్తున్న రాజారెడ్డి తదితరులు

పెదపూడి: సేవే లక్ష్యంగా సామాజిక బాధ్యతతో ఆపదలో ఉన్నవారికి ఆర్థిక సాయం అందించి జి.మామిడాడ లయన్స్ క్లబ్ అఫ్ శ్రీసూర్య ముందుకు సాగుతోందని క్లబ్ అడ్మిన్ మండ రాజారెడ్డి అన్నారు. జి.మామిడాడ జగ్జీవన్ నగర్‌లో నిరుపేద కుటుంబానికి చెందిన ఎస్.అనంత్ కుమార్ ఇటీవల అనారోగ్యానికి గురై, శస్త్రచికిత్స చేయించుకుని ఇంటి వద్ద ఉంటున్నారు. ఈ నేపథ్యంలో సామాజిక వేత్త నందిక ప్రమీల ద్వారా ఆ కుటుంబ ఆర్థిక ఇబ్బందులు తెలుసుకుని లయన్స్ క్లబ్ సభ్యులు సేకరించిన రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అతడి తల్లిదండ్రులకు ఆదివారం అందజేశారు. మండలంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయడానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించినట్టు రాజారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు పేకేటి సూర్యప్రకాశరావు, ద్వారంపూడి భాస్కరరెడ్డి, పప్పు రామకృష్ణారెడ్డి, నామాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శివపూజకు వేళాయె..

- బుధవారం నుంచి కార్తిక మాసం ప్రారంభం
- గ్రామాల్లో ముస్తాబైన శివాలయాలు
- ఎంతో పుణ్య మాసమని పండితుల ఉవాచ



బలభద్రపురంలో ద్వాదశ జ్యోతిర్లింగాలు

బిక్కవోలు: కార్తిక మాసోత్సవ పూజలకు నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో శివాలయాలు సిద్ధమయ్యాయి. కార్తిక మాసం శివునికి అత్యంత ప్రీతిపాత్రమైనది కావడంతో ఈ మాసమంతా భక్తులు వేకువజామునే గోదావరి కాలువలోనూ, సమీప చెరువుల్లో పుణ్య స్నానాలు ఆచరించి, శివాలయాల్లో పూజలు చేస్తుంటారు. నియోజకవర్గంలోని అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, పెదపూడి మండలాల్లోని శివాలయాల్లో ఈ మాసం నిత్య పూజలతో పాటు, ప్రతి సోమవారం, పౌర్ణమి, ఏకాదశి దినాల్లో స్వామివారికి రుద్రాభిషేకాలు, సహస్ర జ్యోతిర్లింగార్చన, లక్ష బిల్వార్చన, కార్తిక జ్వాలా తోరణం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఈ నెల 22 నుంచి నవంబర్ 21 వరకు కార్తిక మాసం పూజలు జరుగుతాయి.

బిక్కవోలు మండలంలో..

మండల కేంద్రమైన బిక్కవోలులోని గోలింగేశ్వర స్వామి ఆలయంలో, ఊలపల్లి రోడ్డులోని కేదారేశ్వర స్వామి ఆలయంలో, కొంకుదురు బుడతల మామిడి వద్ద ఉన్న త్రిముఖ లింగేశ్వరస్వామి, పందలపాకలోని కాశీఅన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి, గౌరీశంకర ఆలయంలో, ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో, పార్వతీ పరమేశ్వరుల ఆలయం, బలభద్రపురం ద్వాదశ జ్యోతిర్లింగ ఆలయంలో, తొస్సిపూడి, కొమరిపాలెం, ఊలపల్లి తదితర గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయి.

రంగంపేట మండలంలో..

ముకుందవరంలోని భద్రకాళీ సమేత విశ్వేశ్వర స్వామి, వడిశలేరులో కాశీవిశ్వేశ్వరస్వామి, రంగంపేటలో ఉమారామలింగేశ్వర స్వామి, జి.దొంతమూరులో భాస్కర లింగేశ్వరస్వామి, సుభద్రంపేటలో రాజరాజేశ్వర స్వామి, చంద్రేడులో కాత్యాయనీ సమేత చంద్రశేఖర స్వామి ఆలయంలో నెల రోజులూ ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

పెదపూడి మండలంలో..

జి.మామిడాడ శివారు ఎల్ఎన్ పురంలో భీమేశ్వర స్వామి ఆలయం, పెదపూడిలో శ్యామలాంబ సమేత సోమేశ్వరస్వామి, దోమాడలోని ఉమామందేశ్వర స్వామి, పుట్టకొండలోని భద్రకాళీ సమేత వీరభద్రేశ్వర స్వామి ఆలయంలోనూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

అనపర్తి మండలంలో..

పురాతన ఆలయంగా ఖ్యాతి గాంచిన అనపర్తి ఉమారామలింగేశ్వర స్వామి, కొప్పవరంలో పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి, మహేంద్రవాడ బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి, పొలమూరులో ఉమారామలింగేశ్వర స్వామి, దుప్పలపూడిలో పార్వతీ సమేత చంద్రశేఖర స్వామి ఆలయంతో పాటు, ఇతర గ్రామాల్లోని ఆలయాలు శివ పూజలకు సిద్ధమవుతున్నాయి.



బిక్కవోలులో ప్రాచీన గోలింగేశ్వర స్వామి

పవిత్రమైన మాసం



కార్తిక మాసానికి ఎంతో పవిత్రత ఉంది. శివునికి ప్రీతిపాత్రమైన మాసమిది. ఈ నెలలో భక్తులు భక్తిశ్రద్ధలతో దీపాలు వెలిగిస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయి. ఈ మాసంలో వేకువజాము నుంచే స్వామివారికి పూజలు ప్రారంభిస్తారు. ఈ నెలలోని సోమవారాలు, పౌర్ణమి, ఏకాదశి, పర్వదినాల్లో విశేష పూజలు నిర్వహిస్తారు. భక్తులు కూడా నిత్యం స్వామివారి నామస్మరణతో తరిస్తారు.

– గరిమెళ్ల కాశీవిశ్వేశ్వరరావు(బుజ్జి), పండితుడు, పందలపాక

ప్రతి ఇంటా జ్ఞానజ్యోతులు వెలిగించాలి



త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం చేస్తున్న సమితి సభ్యులు

రాజానగరం: దీపావళి రోజున ప్రతి ఇంటా జ్ఞాన జ్యోతులను వెలిగించాలని రాజమహేంద్రవరానికి చెందిన త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు అన్నారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీతతో పాటు, అనుబంధ గ్రంథాలపై మండలంలోని తూర్పు గానుగూడెం, శ్రీరామనగర్‌లో ఆదివారం ప్రచారం నిర్వహించారు. గురువు తన శిష్యులకు జ్ఞానాన్ని అందించి, విశ్వమంతటా వాటి వెలుగులు ప్రసరించాలని ఆశిస్తాడన్నారు. దీపావళి రోజు ప్రతి ఇంటా దీపాలను వెలిగించడం ద్వారా ఈ యజ్ఞంలో అందరూ భాగస్వాములు కావాచ్చన్నారు. ఈ ప్రచారంలో సమితి సభ్యులు శేఖర్‌బాబు, శోభారాణి, సూర్యకుమారి, వేణు, మాధురి, సంధ్యారాణి, భరత్, లక్ష్మీనారాయణ, లోహిత, విజయ పాల్గొన్నారు.

కూటమి కుట్రలు తిప్పికొట్టాలి

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి
- ఊలపల్లి, పందలపాక గ్రామాల్లో కోటి సంతకాల సేకరణ



ఊలపల్లిలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో సంతకాలు చేస్తున్న మహిళలు



పందలపాకలో మాట్లాడుతున్న డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి. చిత్రంలో నాయకులు

బిక్కవోలు: ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేట్ పరం చేసేందుకు కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని ఊలపల్లి శివారు ఊలపల్లిపాకలు, పందలపాకలోని వినాయక్ నగర్ కాలనీలో వైఎస్సార్ సీపీ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేదలకు వైద్యం అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో గత ప్రభుత్వ హయాంలో కొత్త మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం ఆ గొప్ప ఆశయానికి తూట్లు పొడిచి, వైద్య కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు ప్రయత్నాలు చేస్తోందని మండిపడ్డారు. దీనివలన గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉన్న నాణ్యమైన ప్రభుత్వ వైద్య సేవలు కనుమరుగవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఊలపల్లి గ్రామంలో రెండు వేల సంతకాలు సేకరించి నియోజకవర్గంలో ముందడుగు వేసిన వైఎస్సార్ సీపీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి, ఏఎంసీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, బూత్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డు ముత్యాలరావు, అనపర్తి, బిక్కవోలు మండలాల కన్వీనర్లు సత్తి రామకృష్ణారెడ్డి, పోతుల ప్రసాద్‌రెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షుడు గ్రందాల విజయశేఖర్‌రెడ్డి, పంచాయతీ వార్డు సభ్యులు దుంగల శ్రీను, గుల్లిపల్లి రాంబాబు, కాళ వెంకటరావు, పందలపాక మాజీ సొసైటీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డి, గొలుగూరి సత్యనారాయణరెడ్డి(అబ్బు), వంకా శ్రీను, నల్లమిల్లి సుబ్బారెడ్డి, ఇల్లపు శ్రీను, మండల అధికార ప్రతినిధి గండి వాసు తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు

కమిషనర్ రాహుల్ మీనా

రాజమహేంద్రవరం సిటీ: కార్తిక మాసం నేపథ్యంలో గోదావరి పుణ్య స్నానాలు ఆచరించేందుకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు కమిషనర్ రాహుల్ మీనా తెలిపారు. ఈ మేరకు ఆదివారం పుష్కర ఘాట్‌లో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, భక్తుల రద్దీకి తగినట్లు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసి, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు.

ప్రతి యువజన కార్యకర్తకూ ఎనలేని గౌరవం

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- జి.మామిడాడలో అట్టహాసంగా యువజన విభాగం మండల సమావేశం



జి.మామిడాడలో నేతలు, కార్యకర్తలతో కలిసి అభివాదం చేస్తున్న డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: వైఎస్సార్ సీపీలో ప్రతి యువజన విభాగం కార్యకర్తనూ భవిష్యత్తు ఎమ్మెల్యే స్థాయిలో గౌరవిస్తామని పార్టీ అనపర్తి నియోజకవర్గ కో–ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. జి.మామిడాడ గ్రామంలో పార్టీ యువజన విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నల్లమిల్లి విజయరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి మండల యువజన విభాగం కార్యకర్తల సమావేశం అట్టహాసంగా జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ, కష్టపడి పనిచేసే యువజన కార్యకర్తలకు పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే నామినేటెడ్ పదవులు ఇస్తామని ప్రకటించారు. సమావేశం ఏర్పాటు చేసిన విజయరెడ్డితో పాటు, నియోజకవర్గ యువజన కన్వీనర్ పడాల దుర్గారెడ్డికి అభినందనలు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యేతో పాటు, కూటమి నాయకులు చేస్తున్న బెదిరింపులు, దౌర్జన్యాలు, అక్రమాలకు ఎవరూ భయపడేది లేదన్నారు. ఈ సమావేశానికి వందల సంఖ్యలో యువత హాజరు కావడమే దీనికి నిదర్శనమన్నారు. వచ్చేది మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనన్నారు. ఇప్పుడు దౌర్జన్యాలు, దాడులు, అక్రమాలకు పాల్పడే వారు భారీగా మూల్యం చెల్లించుకోకతప్పదని గట్టిగా హెచ్చరించారు.

యువత పాత్ర కీలకం

పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు గుబ్బల తులసీరామ్ మాట్లాడుతూ, పార్టీ విజయానికి యువత పాత్ర చాలా కీలకమైందన్నారు. పార్టీ విజయమే లక్ష్యంగా యువత శక్తివంచన లేకుండా కష్టపడి పనిచేయాలన్నారు. నియోజకవర్గంలో మచ్చ లేని నేత డాక్టర్ సూర్యనారాయణరెడ్డి మళ్లీ ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలుపు తథ్యమన్నారు. రాజమహేంద్రవరం సిటీ, గోపాలపురం పరిశీలకుడు, రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు మాట్లాడుతూ, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేసే వరకు యువత మరింత సమరోత్సాహంతో శ్రమించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ల కృష్ణారెడ్డి, రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి మండ రాజారెడ్డి, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి నాగుమళ్ల వీరభద్రరావు, అనపర్తి, పెదపూడి మండలాల కన్వీనర్లు సత్తి రామకృష్ణారెడ్డి, గుత్తుల రమణ, పార్లమెంటరీ నియోజకవర్గ బీసీ సెల్ కన్వీనర్ కేతా శ్రీను, నియోజకవర్గ ఎస్సీ సెల్ కన్వీనర్ సాంబత్తుల చంటి, పార్టీ నేతలు ద్వారంపూడి వెంకటరెడ్డి, నందిక ప్రమీల, మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు కోసూరి వాసు, గ్రామ కన్వీనర్ మేడపాటి తాతారెడ్డి, సర్పంచ్ లంక మున్ని, కర్రి శ్రీవెంకటరెడ్డి, వాసంశెట్టి మాధవ, యువజన విభాగం జిల్లా కార్యదర్శి నల్లమిల్లి వేణురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మందుబాబుల ఆగడాలతో రైతులకు ఇక్కట్లు



రంగంపేట: మండలంలోని పలు గ్రామాల శివారు ప్రాంతాల్లో మందుబాబుల ఆగడాల వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాయంత్రమైతే చాలు మందుబాబులు గ్రామాల శివారు, పొలాల వద్ద కల్వర్టులు, తూముల వద్దకు చేరి బహిరంగంగా మద్యం సేవిస్తున్నారు. అనంతరం ఖాళీ బాటిళ్లు పగులగొట్టడం, ఖాళీ బాటిళ్లు, ప్లాస్టిక్ వ్యర్థాలను పొలాల్లోను, పంట కాలువల్లో పారవేస్తున్నారు. దీంతో పంట కాలువల్లో, పొలాల్లోకి వెళుతున్న రైతులు గాయాల పాలవుతున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాల కారణంగా పంట కాలువలు పూడుకుపోయి, నీరు పారడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రంగంపేట, ముకుందవరం, సుభద్రంపేట తదితర గ్రామాల శివార్లలో ఈ సమస్య ఎక్కువగా ఉందని రైతులు అంటున్నారు. మందుబాబుల ఆగడాలను సంబంధిత అధికారులు అరికట్టాలని వారు కోరుతున్నారు.

ముందస్తు దీపావళి సంబరాలు



కొమరిపాలెంలో ముందస్తు దీపావళి నిర్వహిస్తున్న చిన్నారులు, యువతులు

బిక్కవోలు: మండలంలోని కొమరిపాలెం గ్రామంలో ముందస్తు దీపావళి సంబరాలు ఘనంగా నిర్వహించారు. సోమవారం దీపావళిని పురస్కరించుకుని ఆదివారం కొమరిపాలెంలో సంబరాలు చేశారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, సత్యభామ వేషధారణలో ఆకట్టుకున్నారు. నరకాసుడి చిత్రపటాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రముఖులు కర్రి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ, దీపావళి ఎందుకు వచ్చింది, సత్యభామ నరకాసుడిని వధించిన ఇతివృత్తాన్ని వివరించారు. అనంతరం ఇంటి వద్ద బాణసంచా కాల్చినప్పుడు తీసుకోవాల్సిన జాగత్తలు విశదీకరించారు. అనంతరం చిన్నారులు ఉత్సాహంగా బాణసంచా కాల్చారు.

ఖరీఫ్ కళకళ





చంద్రేడులో కళకళలాడుతున్న మినుము పంట (అంతర చిత్రం) రంగంపేటలో పూత మీదున్న వంగ తోట

రంగంపేట: మండలంలో సాగు చేసిన ఖరీఫ్ పంటలు కళకళలాడుతున్నాయి. వడిశలేరు, రంగంపేట, చంద్రేడు, పెదరాయవరం, కోటపాడు, మర్రిపూడి, సింగంపల్లి, నల్లమిల్లి, దొడ్డిగుంట, వెంకటాపురం, సుభద్రంపేట, ముకుందవరం, జిదొంతమూరు, వీరంపాలెం, ఈలకొలను, ఎస్టీ రాజాపురం తదితర గ్రామాల్లో రైతులు సాగు చేసిన వరి, మొక్కజొన్న, మినుము, పెసర, మిరప పంటలతో పాటు, వంగ, బెండ, ఆనప, బీర, చిక్కుడు తదితర కూరగాయ పంటలు వాతావరణం అనుకూలించడంతో కళకళలాడుతున్నాయి. బోర్ల కింద ముందుగా సాగు చేసిన వరి పంట కోతలు ప్రారంభమయ్యాయి. మిగతా చోట్ల పొట్ట, ఈనిక దశలో ఉంది. వరి ఈ ఏడాది ఎకరానికి 30 నుంచి 35 బస్తాల దిగుబడి ఉంటుందని రైతులు అంటున్నారు. మొక్కజొన్న తోటలు కూడా ఏపుగా ఎదిగి, కండ కట్టే దశలో ఉన్నాయి. మినుము, పెసర చేలు పూత, పిందెలతో కళకళలాడుతున్నాయి. పచ్చిమిర్చి కోతలు కోస్తున్నారు. వాతావరణం అనుకూలించడం, చీడపీడల బెడద తగ్గడంతో కొంత మేర ఖర్చులు తగ్గాయని రైతులు చెబుతున్నారు.

నిబంధనలు హుళక్కేనా..?



కోరుకొండ శివారున ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలు

కోరుకొండ: అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా దీపావళి బాణసంచా దుకాణాల ఏర్పాటుకు నిబంధనలు కఠినంగా అమలు చేస్తున్నారు. అయితే కోరుకొండలో అవి కొండెక్కాయి. మండలంలో 22 గ్రామాలున్నాయి. కోరుకొండలో 9 దుకాణాలు, బూరుగుపూడి, గాడాల, దోసకాయలపల్లి, శ్రీరంగపట్నం గ్రామాల్లోనూ రెండేసి చొప్పున దుకాణాలు ఏర్పాటు చేశారు. దుకాణాల మధ్య నిర్ణీత దూరం, నీరు, ఇసుక బకెట్లు ఏర్పాటు చేయాలంటూ అధికారులు హెచ్చరికలు చేశారు. దుకాణాల మధ్య ఏమాత్రం దూరం లేకుండా ఒకే దుకాణంగా ఏర్పాట్లు చేశారు. ఇవేమీ అధికారులకు కానరావడం లేదా అని కొనుగోలుదారులు ప్రశ్నిస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యులెవరంటూ నిలదీస్తున్నారు.

పేలుతున్న ధరాబాంబులు

- జోరుగా బాణసంచా విక్రయాలు
- వ్యాపారుల్లో పెరిగిన జోష్



రాజానగరంలో రావుల చెరువు గట్టున ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలు

రాజానగరం: దీపాల పండగగా పేరొందిన దీపావళి అంటే అందరికీ ఎంతో ఆనందం. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు సంతోషాలను పంచుకునే పండగ అనడం అతిశయోక్తి కాదు. అటువంటి పండగ సందడి జనావళిలో క్రమేపీ తగ్గుతూ వస్తోంది. దీనికి ప్రధాన కారణం ఆర్థికపరమైన ఒడుదొడుకులే కారణమన్న వాదనలు లేకపోలేదు. బాణసంచా కాలుస్తూ జనాలు ఆనందిస్తే, బాణసంచా సామగ్రిని విక్రయిస్తూనే వ్యాపారులు సంబరపడిపోతుంటారు. ప్రస్తుతం నియోజకవర్గంలో ప్రతి అంగడిలో ఇదే ఒరవడి కనిపిస్తుంది.

నియోజకవర్గంలో రాజానగరం, దివాన్‌చెరువు, శ్రీరామపురం, తోకాడ, పుణ్యక్షేత్రం, కోరుకొండ, సీతానగరం, రఘుదేవపురం, వంగలపూడి, గాదరాడ, మధురపూడి తదితర ప్రాంతాల్లో దీపావళి సామగ్రి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. వీటితో పాటు రాధేయపాలెం, చక్రద్వారబంధం, దివాన్‌చెరువు (గామన్ బ్రిడ్జి రోడ్డు)ల్లోనూ హోల్‌సేల్ దుకాణాల్లో విక్రయాలు ఊపందుకున్నాయి. వాతావరణం అనుకూలంగా ఉండటం వలన బాణసంచా వ్యాపారుల్లో ఉత్సాహం రెట్టింపైంది. గతేడాది నూరు శాతం పైబడి విక్రయాలు సాగడంతో వ్యాపారులు రెట్టించిన ఉత్సాహంతో బాణసంచా నిల్వలు ఉంచారు. దుకాణాలు కూడా గతంలో కంటే పెరిగాయి. చిచ్చుబుడ్లు, తారాజువ్వలు, కాకర పువ్వొత్తులు, మతాబులు, టపాసులు తదితర బాణసంచా సామగ్రి కొనుగోలుకు ఏ దుకాణానికి వెళ్లినా ధరలు ఆకాశాన్నంటే స్థాయిలో పలుకుతున్నాయి. కొనుగోళ్లు పెరగడంతో వ్యాపారులు ఒకరికొకరు పోటీ పడి ధరలు పెంచేస్తున్నారు. ఈ నేపథ్యంలో బ్యాగుతో సామగ్రి కొనుక్కుని వెళ్లేందుకు వచ్చిన కొనుగోలుదారులు సంచి నిండక అసంతృప్తితోనే ఇంటిముఖం పడుతున్నారు.

16 దుకాణాలకు అనుమతి

సీతానగరం: మండలంలో 16 బాణసంచా దుకాణాలకు అనుమతి ఇచ్చినట్టు తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. దుకాణదారులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. రఘుదేవపురంలో 4 దుకాణాలు, సీతానగరంలో 9, బొబ్బిల్లంకలో 2, మిర్తిపాడులో ఒక బాణసంచా దుకాణానికి అనుమతి ఇచ్చినట్టు వివరించారు. నిబంధనల మేరకు ప్రతి దుకాణం వద్ద నాలుగు బకెట్ల ఇసుక, 200 లీటర్ల నీరు ఉంచాలన్నారు. దుకాణాల మధ్య మూడు మీటర్లు ఖాళీ ఉండాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కానరాని సందడి

దీపావళి అంటేనే రెండు రోజుల ముందు నుంచి సందడి కనిపిస్తుంది. అటువంటి పండగ ముందురోజూ మండలంలో సందడి లేకపోవడంతో బాణసంచా వ్యాపారులు నిరాశకు గురయ్యారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాల వద్ద సందడి కానరాలేదు. బేరాల్లేక దుకాణాలు వెలవెలబోయాయి. దీపావళి రోజున కొనుగోళ్లు పెరుగుతాయని వ్యాపారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.